క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ


సుధాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన డీఎస్పీ వెంకటరామయ్య

ఆళ్లగడ్డ: డీఎస్పీగా వెంకటరామయ్య బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు దిశ పోలీస్‌ స్టేషన్‌ డీఎస్పీగా వ్యవహరిస్తున్న ఈయనను ఇటీవల ప్రభుత్వం బదిలీపై ఆళ్లగడ్డకు కేటాయించింది. ఇక్కడ పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని తిరుపతి ఎస్బీ డీఎస్పీగా బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆళ్లగడ్డ సబ్‌ డివిజనల్‌ పోలీస్‌ కార్యాలయం చేరుకున్న వెంకటరామయ్య పాత డీఎస్పీ సుధాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఇరువురు ఒకరినొకరు అభినందించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వెంకటరామయ్య మాట్లాడుతూ శాంతి భద్రతలు, మహిళల రక్షణపై దృష్టి సారిస్తామన్నారు. సబ్‌ డివిజన్‌ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని చెప్పారు.

5న సీఎస్‌ఐ చర్చి వార్షికోత్సవం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని సీఎస్‌ఐ చర్చి 5వ వార్షికోత్సవ వేడుకలను ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు సోమవారం తెలిపారు. పరిశుద్ధ మత్తయి చర్చి నిర్మించి ఐదేళ్లు అవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా ది రైట్‌ రెవరెండ్‌ డాక్టర్‌ పుష్పలలిత బిషప్‌ (నంద్యాల అధ్యక్ష ఖండము) రానున్నట్లు చెప్పారు. ప్రెస్బిటర్‌ చైర్మన్‌ రెవరెండ్‌ డేవిడ్‌ పుష్పరాజ్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయని, రాత్రి చెక్కభజన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పకడ్బందీగా భూ సర్వే

ఉయ్యాలవాడ : మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం కింద భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్‌ రవికుమార్‌ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో చేపట్టిన కొండుపల్లె గ్రామంలో భూముల రీసర్వే పూర్తయిందన్నారు. అలాగే రెండో విడత సుద్దమల్లలో 1,226 ఎకరాలు, నర్సిపల్లె 1,221, రూపనగుడి 2,261, గోవిందపల్లె 605 ఎకరాల్లో రైతుల సమక్షంలోనే సర్వే చేపడతామని చెప్పారు. సర్వే పూర్తయిన తరువాత హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. మండల సర్వేయర్‌ విజయలక్ష్మి, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): మేడే సందర్భంగా టీవీ టెక్నీషియన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సోమవారం నాగులకుంట రోడ్డులోని శివాలయం వద్ద పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం అధ్యక్షుడు కరీముల్లా మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఉపశమనం పొందేందుకు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కన్నయ్య, శ్రీధర్‌, వీరారెడ్డి, ఇలియాస్‌, వెంకటేశ్వరరెడ్డి, రాఘవేంద్ర, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోండి

ఉయ్యాలవాడ : గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఇంటి వద్దకే ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమాన్ని చేపట్టిందని ఉయ్యాలవాడ వైద్యాధికారి రమేష్‌ చంద్ర బాలాజీ తెలిపారు. సోమవారం మండలంలోని హరివరం గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ ఫిజీషియన్‌ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ నెలలో రెండు సార్లు 104 మొబైల్‌ మెడికల్‌ వాహనంలో గ్రామానికి చేరుకుని రోజంతా గ్రామంలోని ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. ఎంపీహెచ్‌ఓ దస్తగిరి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్యాలయంలో స్పందన

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో అసిస్టెంట్‌ కమిషనర్‌ వెంకటదాసు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 3 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగానికి 1, ప్రాపర్టీ ట్యాక్స్‌కు సంబంధించి 2 వినతులు అందాయి. అసిస్టెంట్‌ కమిషనర్‌ వెంకటదాసు మాట్లాడుతూ కార్యాలయంలో నిర్వహించే స్పందనలో నూతన ఒరవడిని తీసుకువచ్చామన్నారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారిని స్పందన కార్యక్రమానికి పిలిపించి అర్జీదారుడి సమస్యను పరిష్కరించేందుకు మార్గం సుగమం చేశామని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ సిటీ ప్లానింగ్‌ అధికారి నరసింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.

జొన్నల పంపిణీ ప్రజలకు ఉపయోగకరం


కార్డుదారులకు జొన్నలు అందజేస్తున్న పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: రేషన్‌ షాపుల ద్వారా ప్రభుత్వం జొన్నలను పంపిణీ చేయడంతో ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్‌ చైర్మన్‌ పీపీ నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దీబగుంట్ల గ్రామంలో ఎండీయూ వాహనం ద్వారా జొన్నల పంపిణీని ప్రారంభించారు. కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డీటీలు విజయశేఖర్‌, రామచంద్రారావు, వీఆర్‌ఓ నరేంద్ర పాల్గొన్నారు.

చదివిన బడిని గుర్తుంచుకొని..

- పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల చేయూత
- విరాళాలతో అభివృద్ధి పనులు, వస్తు సామగ్రి అందజేత
- ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు
- దేశ నాయకుల విగ్రహాల ఏర్పాటు


యర్రగుంట్లలో జాతీయ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేసిన దృశ్యం


గోవిందపల్లెలో ఏర్పాటు చేసిన స్టేజీ


గోవిందపల్లెలో మూడు తరగతి గదులతో కూడిన షెడ్డు

శిరివెళ్ల: తాము చదివిన పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు వస్తున్నారు. చిన్నప్పుడు తమకు విద్యా బుద్ధులు నేర్పిన గురువులకు సన్మానాలు చేస్తూ ఉత్తమ విద్యార్థులవుతున్నారు. మండలంలోని శిరివెళ్ల, యర్రగుంట్ల, గోవిందపల్లె, రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలల పూర్వ విద్యార్థులు సమ్మేళనాలు నిర్వహించుకున్న అనంతరం వసతుల కల్పన కోసం విరాళాలు అందజేసి ఆదర్శంగా నిలుస్తున్నారు.

☛ గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు 4 పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జరిగాయి. ఇందులో 1984–85, 87–88, 88–89, 93–94 సంవత్సరాల్లో చదివిన విద్యార్థులు కలుసుకొని తమకు తోచిన విధంగా పాఠశాల అభివృద్ధి కొంత మొత్తం అందజేశారు.

☛ తరగతి గదుల కొరత నివారణకు 4 రేకుల షెడ్డులను ఏర్పాటు చేశారు.

☛ పాఠశాలలో సరైన స్టేజీ లేకపోవడంతో 1985–86 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు స్టేజీ ఏర్పాటు చేయించారు.

☛ ఏటా పదో తరగతి పరీక్షల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 1993–94 విద్యార్థులు రూ.6 వేల ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు.

☛ గత నెలలో 1984–85కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. నాటి విద్యార్థులందరూ కలిసి రూ. లక్ష పోగు చేసి విరాళంగా అందజేశారు. పాఠశాల అభివృద్ధికి మరింత తోడ్పాటునందిస్తామని చెప్పారు.

☛ యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు రెండు జరిగాయి. అందులో 1987–88 బ్యాచ్‌ విద్యార్థులు 2012లో కలుసుకున్నారు. అప్పటి నుంచి పాఠశాల అభివృద్ధికి వారు కృషి చేస్తున్నారు. ఇప్పటికే రూ.80 వేలతో బండ పరుపు, ప్రార్థన చేసే ప్రాంతంలో మహాత్మా గాంధీ, వివేకానంద స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే.. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులలో మొదటి మూడు స్థానాల్లో నిలిచే విద్యార్థులకు ఏటా రూ.12 వేలు ప్రోత్సాహక బహుమతులను అందచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

☛ రాజనగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. 60 వేలు విలువజేసే కంప్యూటర్లను పూర్వ విద్యార్థులు విరాళంగా అందజేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం



గోవిందపల్లె పాఠశాలలో 6 – 10వ తరగతి వరకు చదివాం. 1984–85లో పది పాసయ్యాం. 38 ఏళ్ల తర్వాత అందరం కలుసుకున్న సందర్భంగా పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష విరాళంగా అందచేశాం. తాము చదివిన పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించుకున్నాం. టీచర్లు, వ్యాపారులు, వివిధ హోదాలు ఉన్నా వారు సహాయం చేస్తున్నారు. మేము ఈ విరాళంతో ఆగిపోదలుచుకోలేదు. మరింత సహకరించేందుకు చర్చిస్తున్నాం.

– తిరుపతయ్య, పూర్వ విద్యార్థి, గోవిందపల్లె

చైతన్యమైన సహాయం చేస్తున్నాం



చదివిన పాఠశాల రుణం తీర్చుకుంటున్నాం. యర్రగుంట్ల ఉన్నత పాఠశాలలో 1987–88లో 10వ తరగతి వరకు చదివాం, గతేడాది తామందరం కలుసుకున్నాం. ఆ సందర్భంగా పాఠశాలకు ఏదైనా చేద్దామని అనుకొని టీచర్ల కోరిక మేరకు రూ.80 వేలు వెచ్చించి పెట్టి బండ పరుపు వేయించాం. అలాగే భవిష్యత్‌ తరాలకు జాతీయ నాయకులు గుర్తుండేలా వారి విగ్రహాలు ఏర్పాటు చేయించాం. ఏటా మెరిట్‌ విద్యార్థులకు ఆగస్టు 15న ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తున్నాం.

– కృష్ణారెడ్డి, పూర్వ విద్యార్థి, యర్రగుంట్ల

తోడ్పాటు అభినందనీయం



తమ పాఠశాలకు పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళాలు జరిగే సమయాల్లో చదువుకున్న పాఠశాలకు ఇతోధికంగా విరాళాలు అందిస్తున్నారు. తరగతి గదుల కొరతను వారి దృష్టికి తీసుకెళ్లడంతో రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. స్టేజీ నిర్మాణంతో పాటు, ఉపకార వేతనాలు అందిస్తున్నారు. పాఠశాల అభివృద్ధికి వారి తోడ్పాటు అభినందనీయం.

– నాగలక్ష్మి, హెచ్‌ఎం, గోవిందపల్లె

జిల్లాలో 42.5 మి.మీ వర్షపాతం నమోదు

నంద్యాల(అర్బన్‌): జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. మొత్తం మీద 42.5మి.మీ వర్షపాతం నమోదైందని ఇన్‌చార్జ్‌ డీఆర్‌ఓ కామేశ్వరరావు సోమవారం తెలిపారు. చాగలమర్రిలో అత్యధికంగా 85.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా, వెలుగోడులో అత్యల్పంగా 12.2 మి.మీ వర్షం కురిసిందన్నారు. అలాగే.. శ్రీశైలంలో 80.4 మి.మీ, జూపాడుబంగ్లా 77.2, నందికొట్కూరు 72.6, బనగానపల్లె 62.4, బేతంచెర్ల 54.8, కొలిమిగుండ్ల 54.2, కొత్తపల్లి 50.0, అవుకు 48.6, ఆత్మకూరు 47.2, గోస్పాడు 43.2, నంద్యాల 42.0, పాణ్యం 41.6, శిరివెళ్ల 41.2, పాములపాడు 40.8, మహానంది 38.4, డోన్‌ 37.2, పగిడ్యాల 36.4, మిడుతూరు 36.2, రుద్రవరం 35.8, కోవెలకుంట్ల 32.0, ప్యాపిలి 30.2, ఉయ్యాలవాడ 29.4, దొర్నిపాడు 26.8, గడివేముల 22.6, ఆళ్లగడ్డ 20.4, సంజామల 13.4 మి.మీ వర్షం కురిసిందని వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరు మెట్ట వద్ద సోమవారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు. మెట్ట వద్ద పేకాట ఆడుతున్నట్లు శిరివెళ్ల సీఐ చంద్రబాబు నాయుడుకు సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి దాడి చేయగా ఎల్లావత్తులకు చెందిన వెంకటేశ్వర్లు, కృష్ణ, రుద్రవరానికి చెందిన ఓబులేసు, నరసింహులు, శిరివెళ్ల మండలం గుండంపాడుకు చెందిన తులసిరెడ్డి, చిన్నకంబలూరుకు చెందిన మహేశ్వరరెడ్డి పట్టుబడ్డారు. వారి నుంచి రూ.7,030 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ చెప్పారు.

అభివృద్ధే లక్ష్యం.. సంక్షేమమే ధ్యేయం


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

- ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- దొర్నిపాడులో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

దొర్నిపాడు: అధికారంలోకి వచ్చిన రోజు నుంచి అభివృద్ధే లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. దొర్నిపాడు సచివాలయం–1లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరిగి సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా భావిస్తుందన్నారు. కేవలం దొర్నిపాడు–1 సచివాలయం పరిధిలో 4,768 మంది లబ్ధిదారులకు రూ.11.04 కోట్లు పథకాల కింద ఖర్చు చేసిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ బత్తుల నాగేశ్వరరావు యాదవ్‌, సొసైటీ చైర్మన్‌ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్‌ దేవమణి, వైస్‌ ఎంపీపీ లక్ష్మీదేవి, మార్కెట్‌యార్డు డైరెక్టర్‌ భూమా శ్రీనివాసరెడ్డి, నాయకులు కాకనూరు మనోహర్‌రెడ్డి, పగడాల శ్రీనివాసులు, మంటి ఓబన్న, వనిపెంట ప్రవీణ్‌కుమార్‌ రెడ్డి, పయిడేల ప్రతాప్‌రెడ్డి, డీలర్‌ శివుడు, చిన్న వెంకటరామిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శాంతయ్య, చిన్నమద్దిలేటి, ఉప సర్పంచ్‌ లక్ష్మీరెడ్డి, నడిపెన్న, బత్తుల కృష్ణయ్య యాదవ్‌, తిరుపతయ్య, రామకృష్ణ, పాదం శీను, నడిపెన్న,గోపాల్‌ యాదవ్‌, శ్రీపతి ప్రసాద్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌ నర్సిరెడ్డి, ఎంపీడీఓ నాగఅనసూయ, ఏఈ రామసుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.

ఆరు పథకాలు అందుతున్నాయి



మా కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆరు పథకాలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.2,00,785, ఇన్‌పుట్‌ సబ్సిడీ రూ.27,000 ఇలా మొత్తం రూ.3,62,748 వచ్చింది. ఇప్పటి వరకు తాము ఇంత మొత్తం లబ్ధి పొందలేదు.

– చిన్నవెంకటరామిరెడ్డి, దొర్నిపాడు

ఇంటి స్థలం కూడా ఇచ్చారు



మా కుటుంబానికి పింఛన్‌ కానుక, పంటల బీమా, రైతు భరోసా, సున్నావడ్డీ (డ్వాక్రా) పథకాల కింద రూ.3,67,783 లబ్ధి చేకూరింది. అలాగే మాకు ఇల్లు లేకపోవడంతో ప్రభుత్వం స్థలం కూడా ఇచ్చింది. ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి మా ఇంటికి వచ్చి ఏఏ పథకాలు అందాయని అడిగి తెలుసుకున్నారు. ఇలా ఎన్నడూ ఎవరూ ఇంటికొచ్చి అడగలేదు.

–వెంకటసుబ్బమ్మ, దొర్నిపాడు

సచివాలయ ఉద్యోగి మృతి


మృతి చెందిన సోఫియా

ఆళ్లగడ్డ: పట్టణంలోని పాతూరు వీధికి చెందిన సోఫియా (20) మూర్ఛ వ్యాధితో సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. ఈమె బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల సచివాలయంలో హార్టికల్చర్‌ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తుంది. రోజులాగే విధులకు వెళ్లొచ్చి ఇంట్లో నిద్రిలోనే మృతి చెందింది. మృతురాలి తండ్రి సంజీవరాయుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై ఆలయ ప్రాకారాల్లో విహరించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముక్కోటిదేవతలకు నిలయమైన గోమాతను పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకీ ముందు ఉంచి ఉత్సవాన్ని జరిపారు.

అన్నదాతకు ఆదాయం.. పేదలకు ఆరోగ్యం


జొన్నలు పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: అన్నదాతలకు ఆదాయం కల్పించడంతో పాటు పేదల ఆరోగ్యాన్ని కాపాడటమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కార్డుదారులకు ఉచితంగా జొన్నలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని తహసీల్దార్‌ హరినాథరావు ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని బాలాజీ వీధిలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రేషన్‌ కార్డుదారులకు జొన్నల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా నంద్యాల జిల్లాలో చేపట్టడం సంతోషకరమన్నారు. వచ్చే నెల నుంచి జొన్నలతో పాటు మూడు కిలోల రాగులు కూడా అందజేస్తామని చెప్పారు. సీఎస్‌డీటీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ప్రభుత్వం రేషన్‌ కార్డుదారులకు బియ్యంతో పాటు జొన్నలు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపీపీ బుద్ధా భాగ్యమ్మ అన్నారు. సోమవారం స్థానిక ఎస్సీ కాలనీలో జొన్నల పంపిణీని సర్పంచ్‌ మేకల ఓబులేస్‌, రైతు సలహా మండలి చైర్మన్‌ పోచా రాధాకృష్ణారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారిగా నంద్యాల జిల్లాలోనే జొన్నల పంపిణీ ప్రారంభించారని, చౌక దుకాణ డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లు అశ్రద్ధ చేయకుండా కార్డుదారులందరికీ పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్‌ రవికుమార్‌ మాట్లాడుతూ మండలానికి 8.214 క్వింటాళ్ల జొన్నలను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. వీఆర్‌ఓ రవిప్రసాద్‌, కార్యదర్శి జయరామిరెడ్డి, ఆర్‌ఐ సత్తార్‌ పాల్గొన్నారు.

దొర్నిపాడు: రేషన్‌ బియ్యంతో పాటు జొన్నలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్‌ జయప్రసాద్‌ తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఒక కిలో బియ్యం తగ్గించి జొన్నలు ఉచితంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ బత్తుల నాగేశ్వరరావు యాదవ్‌, సర్పంచి దేవమణి, కాకనూరు మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, డీలర్లు కాకనూరు మోహన్‌నాయుడు, శివుడు, సుధాకర్‌, ఎంపీపీ అమర్‌నాథ్‌ రెడ్డి, సొసైటీ చైర్మన్‌ బాలవెంకట్‌ రెడ్డి, సర్పంచ్‌ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీపీ నాయక్‌ వసీం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎండీయూ వాహనం వద్ద కార్డుదారులకు ఉచితంగా జొన్నల పంపిణీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ఇప్పటికే బియ్యం, చక్కెర, కంది బేడలు అందజేస్తుందన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(అర్బన్‌): ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఇద్దరు లబ్ధిదారులకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అందజేశారు. సోమవారం ఎంపీ నివాసంలో ఇద్దరు లబ్ధిదారులకు రూ.5.25 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ పేదల ప్రజల సంక్షేమానికి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్‌): ఈనెల 31న జరిగే సిద్దేశ్వరం జల జాగారణ దీక్షకు తరలివచ్చి విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎన్‌ రెడ్డి కోరారు. స్థానిక కార్యాలయంలో దీక్షకు సంబంధించిన కరపత్రాలను సమితి నాయకులతో కలిసి సోమవారం విడుదల చేశారు. వెంకటేశ్వరనాయుడు, మహేశ్వరరెడ్డి, దశరథ రామిరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు


మున్సిపల్‌ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, కమిషనర్‌


జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

నంద్యాల(అర్బన్‌): అంతర్జాతీయ మేడే వేడుకలను పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ తదితర సంఘాల ఆధ్వర్యంలో దాదాపు 25 సెంటర్లలో జెండాలను ఆవిష్కరించి దినోత్సవ విశిష్టతను వివరించారు. ఎన్‌టీఆర్‌ కాంప్లెక్స్‌ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. మున్సిపల్‌ కార్యాలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్‌ మాబున్నిసా, కమిషనర్‌ రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

➡ ఆటో నగర్‌లో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బొమ్మలసత్రం వద్ద సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్‌, భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద ఏఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌, సంజీవనగర్‌ గేటు వద్ద సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఆర్టీసీ బస్టాండ్‌ వద్ద శ్రీనివాసులు సంఘం జెండా ఆవిష్కరించారు. సీపీఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ కార్యాలయ సమీపంలో డివిజన్‌ కార్యదర్శి శంకర్‌, రైస్‌ మిల్లర్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు లక్ష్మయ్య జెండాను ఆవిష్కరించారు. గాంధీచౌక్‌లో హమాలీ యూనియన్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌ కోడ్‌లుగా కుదింపు చేసి కార్మికులను పెట్టుబడి దారులకు, కార్పొరేట్‌ సంస్థలకు బానిసలుగా చేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. నాయకులు తోటమద్దులు, వెంకటలింగం, శ్రీనివాసమూర్తి, రఫీ, సోమన్న, రాము, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, షేక్షావలి పాల్గొన్నారు.

➡ **గోస్పాడులో...**
మండల కేంద్రం గోస్పాడులో మేడేను అంగన్‌వాడీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్‌ జిల్లా నాయకురాలు నిర్మలమ్మ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణకుమారి, చెన్నయ్య, మార్క్‌, సుమలత, శివలక్ష్మి, హుసేనమ్మ పాల్గొన్నారు.

వీడని వాన..నష్టపోతున్న రైతన్న


పేరూరు-బి.నాగిరెడ్డిపల్లె మధ్య నేలవాలిన వరి పైరు


కొండమాయపల్లె-ఆర్‌.కొత్తూరు మధ్య తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతన్న

రుద్రవరం: విడతలు విడతలుగా కురుస్తున్న అకాల వర్షం కారణంగా రైతులు భారీగా నష్టపోతున్నారు. గాలి వానలకు పైర్లు నేల వాలడంతో పాటు ఆరబెట్టిన ధాన్యం దిగుబడులు తడిసి ముద్ద అవుతున్నాయి. నేల వాలిన పంట కోతలు కోయించుకోవాలంటే ఖర్చులు పెరిగడంతో పాటు దిగుబడులు తగ్గుతున్నాయి. అలాగే వర్షపు నీటికి ఆరబెట్టిన ధాన్యం తడవడంతో రంగు మారుతుందనే భయం రైతుల్లో నెలకొంది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో బోరు బావులు, చెరువులు, తెలుగుగంగ కాల్వల కింద రబీ సీజన్‌లో దాదాపు వరి 6వేల హెక్టార్లలో, అదే విస్తీర్ణంలో మొక్క జొన్న, మూడువేల హెక్టార్లలో మినుము పంటలు సాగు చేశారు. పంటల కాలం పూర్తి కావడంతో కొద్ది రోజులుగా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆశించిన స్థాయిలో దిగుబడులు, ధర ఉండటంతో కొందరు రైతులు లాభాలు గడించారు. అయితే అకాల వర్షాల బారిన పడిన రైతులు మాత్రం లబోదిబోమంటున్నారు. పంట కోతల ఖర్చులు పెరగడం తడిసిన ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించుకొని నష్టాలు చవి చూస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతలుగా గాలి వాన కురవగా సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షం, గాలికి మండలంలోని కొండమాయపల్లె, ఆర్‌.కొత్తూరు,రుద్రవరం,చిన్నకంబలూరు, అప్పనపల్లె, డీ.కొట్టాల,శ్రీరంగాపురం తదితర గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. అలాగే ఆయా గ్రామాల సమీపంలో రోడ్లపై, పొలాలు, బయలు ప్రదేశాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్ద అయ్యాయి. ధాన్యం అలాగే ఉంచితే రంగు మారుతుందనే భయంతో రైతులు వాటిని మరో ప్రదేశంలోకి మార్చారు. మరి కొందరు ఇళ్లకు తరలించారు. అలాగే..కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి


పోలీసులతో మాట్లాడుతున్న జడ్జి వాసు

నంద్యాల(వ్యవసాయం): ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని మూడవ అదనపు జిల్లా జడ్జి వాసు కోరారు. సోమవారం మండల లీగల్‌సెల్‌ ఆధ్వర్యంలో పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో బనగానపల్లె, నందివర్గం, కోవెలకుంట్ల, పేరుసోముల, పాణ్యం, ఆళ్లగడ్డ, మహానంది తదితర మండలాల పోలీసులను అడిగి రాజీ అయ్యే కేసుల వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, సెబ్‌ అధికారులు, మండల లీగల్‌ సెల్‌ అధికారులు భాస్కర్‌ పాల్గొన్నారు.